నేడు గురుకుల ప్రవేశ పరీక్ష

జనగామ చౌరస్తా/స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 22: జిల్లాలోని సాంఘిక సంక్షేమ (ఎస్సీ), గిరిజన సంక్షేమ (ఎస్టీ), మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల (బీసీ) గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికిగాను 5, 6, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశం కల్పించేందుకు ఈ ఆదివారం ఉమ్మడి ప్రవేశ పరీక్ష జరగనుంది. జిల్లాలోని తొమ్మిది పరీక్ష కేంద్రాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ పీ శ్రీనివాస రావు తెలిపారు. ఐదో తరగతి పరీక్షకు 864 మంది, ఆరో తరగతి 282, ఏడో తరగతి 275, ఎనిమిదో తరగతి 244, తొమ్మిదో తరగతి 186 మంది చొప్పున మొత్తం 1,851 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు వివరించారు. జిల్లా కేంద్రంలోని హనుమకొండ రోడ్డు మార్గంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల (బాలుర) పాఠశాల, పెంబర్తి ఎంజేపీ బీసీ (బాలుర) పాఠశాల, ఎంజేపీ బీసీ (బాలికల) పాఠశాల, స్టేషన్ ఘన్‌పూర్ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలుర) పాఠశాల, జఫర్‌గడ్ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల) పాఠశాల, పాలకుర్తి సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల) పాఠశాల, కరుణాపురం ఎంజేపీ బీసీ గురుకుల (బాలుర) పాఠశాల, ఎంజేపీ బీసీ గురుకుల (బాలికల) పాఠశాల, కొడకండ్ల గురుకుల పాఠశాలల్లో పరీక్ష జరుగుతుందని వివరించారు. కాగా, స్టేషన్ ఘన్‌పూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఉమ్మడి గురుకులాల ప్రవేశ పరీక్షకు 500 మంది విద్యార్థులు హాజ రు కానున్నారని, ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ కృత మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు.

వాగు దారికి అడ్డంగా కందకం తవ్వకం

దారికి అడ్డంగా కందకం తవ్విస్తున్న ఎస్సై

దేవరుప్పుల, ఫిబ్రవరి 22: ఇసుక అక్రమ రవాణాను పోలీసులు నియంత్రిస్తున్నారు. దేవరుప్పుల దాదాసాహెబ్ కాలనీ వద్ద ఇసుక అక్రమంగా తరలించే రహదారిని ఇప్పటికే మూసివేయ గా, శనివారం కడవెండి వాగులోకి ఇసుక ట్రాక్టర్లు దిగే దారికి అడ్డంగా కందకం తవ్వించారు. మండల వ్యాప్తం గా అత్యధిక గ్రామాల గుండా వాగు ప్రవహిస్తుండగా ఇసుకమేటలు ఉన్నా యి. ఇసుకను ట్రాక్టర్ ఓనర్లు అక్రమం గా తరలిస్తున్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఊర సృజన్‌కుమార్ హెచ్చరించారు.

బహిరంగ ప్రకటన

సమస్తప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, మహారాజశ్రీప్రిన్సిపాల్ జానియర్ సివిల్ జడ్జి జనగామ ఉత్తర్వులమేరకు
O.S.NO 189/2024.

Between:
1) ఇరుగు యాకయ్య S/o సిద్దయ్య
2) చింతల మానస, భర్త : మల్లేశ్
3) గానిపాక సిద్దమ్మ, భర్త : కొంరయ్య
4) బోట్ల ఎల్లమ్మ, భర్త క్రి.శే. బిక్షపతి ..వాదులు /Plaintiffs
మరియు
1) జనగామ మండల తహసీల్దారు (రెవెన్యూ అధికారి)
2) To Whom so ever concern.
..ప్రతివాదులు/Defendants

నాయొక్కపై క్లయింట్స్ శ్రీమహారాజశ్రీ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జనగామ కోర్టు యందు O.S.NO 189/2024 సివిల్ దావా వేసినారు. ఇరుగు పరుశాములు, తండ్రీ అయిలయ్య, వారి భార్య మమత మరియు వారి కుమారుడు అరవింద్ ముగ్గురు చనిపోయినారు. వారి యొక్క వారసులు నాయొక్క క్లయింట్స్ పై నలుగురు మాత్రమే. కావున ఇతరులకు ఏమైనా అభ్యంతరాలు ఉన్న యెడల తగిన ఆధారాలతో స్వతహాగా గాని, న్యాయవాది ద్వారా గాని ది.వి. 04-04-2025 రోజున ఉదయం 10:30 సమయంలో జనగామ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్‌జడ్జ్ కోర్టు యందు హాజరు కాగలరని తెలియజేయనైనది.

జనగామ, తేది.23-02-2025.

ఇట్లు: **ఆలేటి సిద్దిరాములు,** న్యాయవాది
జనగాం. Cell: 9949800833 9393000833

పంటలకు నీరందించండి

ఎమ్మెల్యే యశస్విరెడ్డి

దేవరుప్పుల, ఫిబ్రవరి 22: యాసంగి పంటలకు సాగునీటిని విడుదల చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విరెడ్డి అధికారులను ఆదేశించినట్లు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. యాసంగి సీజన్‌లో పంటలు ఎండిపోకుండా వెంటనే దేవాదుల నీటితో అన్ని చెరువులను నింపాలని సూచించారు. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఆమె సాగునీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడినట్లు వివరించారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో పంటలకు నీరు అత్యధికంగా అవసరమవుతుందని, నీరు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని తెలిపారు.

మహా శివరాత్రి జాతర విజయవంతం చేయాలి

ఏర్పాట్లను పరిశీలించిన అదనపు కలెక్టర్, డీసీపీ

ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీసీపీ

పాలకుర్తి, ఫిబ్రవరి 22: ఈనెల 25వ తేదీ నుంచి మార్చి 1వ తేదీ వరకు నిర్వహించే మహా శివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలను అధికారులు అంకితభావంతో పనిచేసి విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మహా శివరాత్రి జాతర ఏర్పాట్లపై డీసీపీ రాజ మహేంద్రనాయక్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఏర్పాట్లను వారు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సకల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలన్నారు. పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని డీసీపీకి సూచించారు. నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలన్నారు. జాతరలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్, క్లోరినేషన్, బ్లీచింగ్ ఫౌడర్ చల్లాలన్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. జాతరలో రెండు జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. లక్షకు పైగా వచ్చే భక్తులకు లడ్డూ ప్రసాదాలు నాణ్యతగా అందించాలన్నారు. ఆలయం విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా వెలగాలన్నారు. ఎలక్షన్ కోడ్ దృష్టిలో ఉంచుకుని అధికారులు పనిచేయాలన్నారు. దైవ దర్శనానికి వచ్చే భక్తులకు బారీకేడ్ ఏర్పాటు చేయాలన్నారు. కొబ్బరి కాయలు, లడ్డూ ప్రసాదం అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్డీఓ డీఎస్ వెంకన్న, జిల్లా పశు వైద్యాధికారి రాధాకిషన్‌రావు, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, డీపీఓ స్వరూపరాణి, విద్యుత్ డీఈఈ వై రాంబాబు, ఉప వైద్యాధికారి సుధీర్, సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, బీ సంతోష్‌రెడ్డి, డీఈఈ అశోక్, రాజేంద్ర, ఎఫ్ ఎల్ చారి, డీఈ కూనమల్ల సంధ్య, తహసీల్దార్ పీ శ్రీనివాస్, ఎంపీడీఓ ఆవుల రాములు, ఎంపీఓ రవీందర్, ఈఓలు మోహన్‌బాబు, కొత్తపల్లి వెంకటయ్య, ఎస్సై దూలం పవన్‌కుమార్, ఏఈ ప్రశాంతి, రణధీర్‌రావు, డాక్టర్ సిద్ధార్థరెడ్డి, అశోక్‌రెడ్డి, అగ్నిమాపక అధికారి శ్రీ రాములు, పంచాయతీ కార్యదర్శి కపిలవాయి వెంకటాచారి, ఆర్ఐ రాకేశ్ పాల్గొన్నారు.

28లోగా మరుగుదొడ్లు నిర్మించుకోవాలి

- పూర్తి చేయకుంటే నిధులు వెనక్కిపోతాయి
- అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్
- నమిలిగొండలో పర్యటన

నమిలిగొండలో నిర్మించిన మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్

స్టేషన్ ఘన్‌పూర్, ఫిబ్రవరి 22: స్వచ్ఛ భారత్ మిషన్ పథకం ద్వారా మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణపనులు ఈనెల 28 వరకు పూర్తి చేయకుంటే నిధులు వెనక్కిపోతాయని అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని నమిలిగొండలో ఆయన పర్యటించారు. జీపీ కార్యాలయాన్ని సందర్శించి గ్రామంలో జనాభా ఎంత? ఆదాయం, ఖర్చులు, సిబ్బంది ఎంతమంది? తదితర వివరాలను కార్యదర్శి జి.జేసుమణిని అడిగి తెలుసుకున్నారు. పల్లె ప్రకృతివనం, నర్సరీ పరిశీలించారు. మొక్కల పంపకం టార్గెట్ ఎంత? ఎన్ని రకాల మొక్కలు? ఎన్ని పెంచుతున్నారని ఈజీఎస్ ఏపీవో ప్రేమయ్యను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకంలో ఏర్పాటు చేస్తున్న ఫాంపాండ్‌ను పరిశీలించారు. స్వచ్ఛభారత్ మిషన్ పథకం ద్వారా నిర్మిస్తున్న మరుగుదొడ్లను పరిశీలించారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో మంజూరైన మరుగుదొడ్లను లబ్ధిదారులు ఈనెల 28వ తేదీలోగా నిబంధనల ప్రకారం నిర్మించుకోవాలని సూచించారు. నిర్మాణం పూర్తయిన మరుగుదొడ్ల ఫొటోలు, లబ్ధిదారుడి బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు జిరాక్స్‌లను పంచాయతీ కార్యదర్శికి అందజేయాలన్నారు. ఫిబ్రవరి 28లోగా నిర్మించుకొని వివరాలను ఆన్‌లైన్ చేస్తేనే రూ.12వేల ప్రోత్సాహకాన్ని పొందుతారని, లేకుంటే కోల్పోతారని తెలిపారు. వారి కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులు మురిగిపోతాయని పేర్కొన్నారు. మరుగుదొడ్ల బిల్లులు పెండింగ్ లేకుండా నిర్మాణ పనులను ఎట్టి పరిస్థితుల్లో ఈనెల 28లోగా నిబంధన మేరకు పూర్తి చేయించాలని ఆదేశించారు. అదనపు డీఆర్‌డీఓ చంద్రశేఖర్, స్వచ్ఛ భారత్ మిషన్ జిల్లా కో ఆర్డినేటర్ కరుణాకర్, ఎంపీడీవో విజయశ్రీ, ఈజీఎస్ ప్రేమయ్య, ఎంపీవో నర్సింగరావు, పంచాయతీ కార్యదర్శి జి.జేసుమణి, ఈజీఎస్ టీఏ సునిత, ఫీల్డ్ అసిస్టేంట్ అమినా సునిల్ పాల్గొన్నారు.

ప్రభుత్వమే దాణా సరఫరా చేయాలి

చిల్పూరు, ఫిబ్రవరి 22 : జీవాల కోసం దాణా ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి సాదం రమేశ్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జీవాల మేత కోసం పెంపకందారులు దూర ప్రాంతాలకు వెళ్తున్నారని తెలిపారు. వరి కోతలు ముగిసే లోగా జీవాలకు దాణా ప్రభుత్వమే అందించి ఆదుకోవాలని కోరారు. గ్రామాల్లోని ప్రభుత్వ భూములను గొర్రెలు, మేకల మేతకు సొసైటీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వేసవిలో పశువులకు నీటికొరత లేకుండా చూడాలని, పశు వైద్యశాలల్లో మందులు అందుబాటులో ఉంచాలన్నారు. రెండేళ్లుగా నట్టల నివారణ మందులు ఎందుకు ఇవ్వడం లేదో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గొర్రెలకు ప్రభుత్వం ఉచితంగా బీమా సౌకర్యం కల్పించి పెంపకందారులను ఆదుకోవాలని కోరారు.

శారదకు ఓయూ డాక్టరేట్

శారద

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 22: జిల్లా కేంద్రానికి చెందిన పానగంటి శారదకు ఉస్మానియా యూనివర్సిటీ గణితం విభాగంలో డాక్టరేట్ ప్రకటించింది. ప్రొఫెసర్ వీ ధర్మయ్య పర్యవేక్షణలో 'కైటేరియా ఫర్ ఓసిలేషన్ ఆఫ్ డిలే డిఫరెన్షియల్ ఈక్వేషన్' అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు. 2017-18లో ఓయూలో పీహెచ్‌డీ అడ్మిషన్ పొందిన శారద ఈనెల ఫిబ్రవరి 1వ తేదీన ఫైనల్ వైవా విజయవంతంగా పూర్తిచేసినట్లు తెలిపారు. జిల్లాలోని కొడకండ్ల మండలం ఏడునూతలకు చెందిన ఉపేందర్‌తో ఆమెకు వివాహమైంది. భర్త ప్రోత్సాహంతో డిగ్రీ, పీజీ, బీఈడీ పూర్తి చేసి ప్రస్తుతం డాక్టరేట్ పట్టా పొందారు. ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ రెసిడెన్షియల్ కళాశాలతోపాటు పలు ఇంజినీరింగ్ కళాశాలల్లో శారద లెక్చరర్‌గా పనిచేశారు.

రైలుకింద పడి రైల్వే ఉద్యోగి మృతి

దుర్గేశ్వర్‌రావు (ఫైల్)

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 22: జనగామ రైల్వే స్టేషన్‌లో శనివారం సాయంత్రం 5.30గంటలకు భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు దిగుతూ ప్రమాదవశాత్తు అదే రైలుకింద పడి ఓ రైల్వే ఉద్యోగి మృతిచెందాడు. కాజీపేట జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గణేశ్‌వాడకు చెందిన ఎడ్ల దుర్గేశ్వర్‌రావు (44) సికింద్రాబాద్ రైలు నిలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. డ్యూటీకి రైలులో షటిల్ చేసేవారు. శనివారం జనగామ రైల్వే స్టేషన్‌లో భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలు దిగే క్రమంలో ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందాడు. అతడికి భార్యతోపాటు కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి స్వస్థలం జిల్లాలోని రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామం. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తరలించారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

శ్రీనివాస్(ఫైల్)

చిల్పూరు, ఫిబ్రవరి 22 : మండలంలోని వెంకటాద్రిపేటకు చెందిన నోముల శ్రీనివాస్(42) కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది శుక్రవారం పురుగులమందు తాగాడు. చికిత్స కోసం కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. అతడికి భార్య రజిత కూతురు, కుమారుడు ఉన్నారు.

విద్యారంగానికి 15శాతం బడ్జెట్ కేటాయించాలి

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 22: విద్యా రంగానికి 15శాతం బడ్జెట్ కేటాయించాలని సాదిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాదిక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఏబీవీ జూనియర్ కళాశాలలో సాదిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యా మహోద్యమం పేరుతో కార్యక్రమం నిర్వహించారు. సాదిక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్ సమావేశాల వరకు ఈ విద్యా మహోద్యమం కొనసాగుతుందన్నారు.

ఎమ్మెల్యే పల్లాను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు


ఎమ్మెల్యే పల్లాకు అంబేద్కర్ చిత్రపటం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 22: జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేశారు. యశ్వంతాపూర్‌లోని నాగులకుంట చెరువును ఆనుకొని ఉన్న ప్రభుత్వ పాఠశాల ప్రహరీ కూలిపోయిగా పాములు, తేళ్లు వస్తున్నాయని తెలిపారు. గతంలో ఒక విద్యార్థి తేలుకాటుకు గురై ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నట్లు చెప్పారు. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల మహేశ్, కట్ట ప్రశాంత్, గువ్వల రవి, గడ్డం నాగేశ్, పుట్ట ఈశ్వర్ పాల్గొన్నారు.

మహాకుంభ మేళాలో పద్మశ్రీ గడ్డం సమ్మయ్యతో జిల్లా చిందుయక్షగాన కళాకారులు

కుంభమేళాలో గడ్డం సమ్మయ్య బృందం ప్రదర్శనలు

దేవరుప్పుల, ఫిబ్రవరి 22: ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభ మేళా వద్ద జానపద ప్రదర్శనలో పాల్గొనేందుకు మండలంలోని అప్పిరెడ్డిపల్లికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు, పద్మశ్రీ గడ్డం సమయ్య బృందం వెళ్లింది. అంతరించి పోతున్న జానపద కళలను కుంభ మేళాలో హాజరైన వారు తిలకించేందుకు కేంద్ర ప్రభుత్వం వేదికను ఏర్పాటు చేసింది. సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ తంజావూర్ ఆధ్వర్యంలో తెలంగాణ నుంచి గడ్డం సమ్మయ్య బృందం శనివారం నుంచి ఆరు రోజులపాటు కళా ప్రదర్శనలు ఇవ్వనుంది. ఆయన మాట్లాడుతూ తన సారథ్యంలో జిల్లాలోని పరసమడ్లకు చెందిన పిల్లిట్ల గోవర్ధన్ బృందం మొదటి రోజు కౌంసమర్ధన, రెండవ రోజు మాయా సుభద్ర, మూడోరోజు సతీతులసి, నాలుగోరోజు కీచకవధ, ఐదోరోజు మైరావణ, ఆరోరోజు భీష్మ విజయం చిందు యక్షగాన రూపం లో ప్రదర్శించనున్నట్టు వివరించారు.

ఎమ్మెల్యేను కలిసిన లింగాలఘణపురం గ్రామస్తులు

ఎమ్మెల్యేను కలిసిన గ్రామస్తులు

లింగాలఘణపురం, ఫిబ్రవరి 22: ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మండల కేంద్రానికి చెందిన పలువురు హనుమకొండలోని క్యాంపు కార్యాలయంలో శనివారం కలిశారు. ఈనెల 26న లింగాలఘణపురంలో జరిగే వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవానికి హాజరు కావాలని కోరారు. శ్రీశైలం, ఏదునూరి వీరన్న, మంద శ్రీధర్‌రెడ్డి, పడకంటి రవి, బంటు సత్తయ్య, భిక్షపతి ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

బచ్చన్నపేట, ఫిబ్రవరి 22 : మండలంలోని బచ్చన్నపేట, అలీంపూర్, ఏజీఎల్, బసిరెడ్డిపల్లి, ఎద్దుగూడెం ఫీడర్ల పరిధిలో నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు కొత్తగా 600 కేవీఆర్ కెపాసిటర్ బాక్సులు ఏర్పాటు చేసినట్లు జనగామ డీఈ లక్ష్మినారాయణ, ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ కెపాసిటర్లతో విద్యుత్ వోల్టేజీ పెరుగుతుందని, రైతులకు ఇబ్బందులు ఉండవని పేర్కొన్నారు. ఏడీఈ వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

పాలాలకు సాగునీరు అందిస్తాం

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- మల్లన్నగండి రిజర్వాయర్, పాలాల పరిశీలన

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

చిల్పూరు, ఫిబ్రవరి 22: మండలంలోని ఫతేపూర్, గార్లగడ్డ తండా, ఎర్ర బోడబండ తండా పరిధిలోని పొలాలకు సాగునీరు అందిస్తామని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆయా తండాల్లో శనివారం పొలాలను చూసిన ఎమ్మెల్యే సాగునీరు అందుతుందా? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మల్లన్నగండి రిజర్వాయర్‌లోకి నీటి పంపింగ్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. రిజర్వాయర్‌లోకి నీటి పంపింగ్ మరో 15రోజులు కొనసాగించాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. మల్లన్న గండి ఎడమ కాల్వ నిర్మాణానికి సర్వే పూర్తయి భూసేకరణ పూర్తయ్యిందని, త్వరలోనే ఎడమ కాల్వ నిర్మించి సాగునీరు అందిస్తామని వెల్లడించారు. వారం రోజుల్లో నీటిపారుదల శాఖ అధికారులు, ఆర్డీవో, ఇతర అధికారులతో సమీక్ష నిర్వహిస్తానని చెప్పారు. సాంకేతిక సమస్యలతో నెల రోజుల పాటు మోటార్లు నడవకపోవడం వల్ల రిజర్వాయర్‌లో నీటి నిల్వ పడిపోయాయని, మళ్లీ వారం రోజులుగా మోటార్లు నడుస్తున్నాయని వివరించారు. పంటలకు నష్టం కలగకుండా నీటిని అందిస్తామని చెప్పారు. బోడబండ తండాకు ఆరు నెలల్లో సాగునీరు అందిస్తామని తండా రైతులకు హామీ ఇచ్చారు. వానకాలంలోగా పైపులైన్ సామర్థ్యం పెంచి చెరువు నింపి రెండు పంటలకు సాగునీరు అందేలా చేస్తానని వెల్లడించారు. చిల్పూరు దేవస్థానం చైర్మన్ పోట్లపల్లి శ్రీధర్‌రావు, సొసైటీ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజుగౌడ్, మార్కెట్ డైరెక్టర్ యశ్వంత్‌రెడ్డి, దేవస్థానం డైరెక్టర్ రత్నాకర్‌రెడ్డి, కాంగ్రెస్ చిల్పూరు మండల అధ్యక్షుడు సురేశ్, లింగారెడ్డి, రంజిత్‌రెడ్డి, బాలరాజు, నీలరాజు, షకీల్, వెంకటేశ్, రవీందర్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో సమస్యలను పరిష్కరించాలి

వాటర్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న నాయకులు

రఘునాథపల్లి, ఫిబ్రవరి 22: మండలంలోని వెల్ది గ్రామంలో ఉన్న ఆదర్శ పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గంగాపురం మహేందర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పొదలలవకుమార్ డిమాండ్ చేశారు. ఆదర్శ పాఠశాలను శనివారం సందర్శించారు. వారు మాట్లాడుతూ పాఠశాలలోని వాటర్ ప్యూరిఫై పాడై రెండేళ్లు కావస్తున్నా ఉన్నతాధికారులు మరమ్మతు చేయించలేదన్నారు. ఎండలు మండుతుండగా విద్యార్థులకు తాగునీరు లేక అల్లాడుతున్నారని తెలిపారు. బాలికలకు పౌష్టికాహారం అందించాలన్నారు. మధ్యాహ్న భోజనం తినేందుకు డైనింగ్‌హాల్ లేక పిల్లలు ఎండలో కూర్చొని తిన్నాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల నాయకులు బాసకర్ల మనీత్ రాజ్ అఖిల కౌశిక్ పాల్గొన్నారు.

వరద కాల్వల పనులు పూర్తి చేయాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రమేశ్

వరద కాల్వను పరిశీలిస్తున్న సీపీఐ శ్రేణులు

జఫర్‌గడ్, ఫిబ్రవరి 22 : మండలంలో వరద కాల్వల నిర్మాణ పనులు పూర్తి చేసి సాగునీరు అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జువారి రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ఉప్పుగల్లు, తమ్మడపల్లి(జీ), ఏబీతండా, జఫర్‌గడ్, హిమ్మత్‌నగర్, తమ్మడపల్లి(జీ), ముగ్ధంతండా పరిధిలో అసంపూర్తిగా ఉన్న వరద కాల్వను సీపీఐ మండల నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఉప్పుగల్లులో సాగునీరు అందించేందుకు రూ.కోట్లు వెచ్చించి రిజర్వాయర్ నిర్మించినా కాల్వలు మాత్రం అసంపూర్తిగా నిలిచాయని తెలిపారు. ఎన్ని కల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెంటనే కాల్వల పనులు పూర్తి చేయించి సాగునీరు అందించి నెరవేర్చాలని కోరారు. మండల నాయకులు, రైతులు పెండ్యాల సమ్మయ్య, మంద బుచ్చయ్య, ఎర్రం సతీష్, ఎర్రం యాదగిరి, గడ్డి రాజు, కొమురయ్య, సాయిలు, రాములు, నాగరాజు, రాజు, సమ్మిరెడ్డి, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

జనగామ చౌరస్తా, ఫిబ్రవరి 22: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా తక్కళ్లపల్లి హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలు, హామీల విషయంలో ఒక్క అడుగు ముందుకు, రెండు అడుగులు వెనకకు అన్న రీతిలో అమలవుతున్నాయని విమర్శించారు. అర్హులందరికీ రైతు భరోసా అందించాలని కోరారు. పంటల బీమా పథకం, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పింఛన్ల పెంపు వంటి హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు ఆదిసాయన్న, ఆకుల శ్రీనివాస్, నాయకులు చొప్పరి సోమయ్య, రావుల సదానందం, చామకుర యాకుబ్, జువారి రమేశ్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలి

తిమ్మంపేటలో నర్సరీని పరిశీలిస్తున్న అదనపు డీఆర్‌డీవో చంద్రశేఖర్

జఫర్‌గడ్, ఫిబ్రవరి 22: నర్సరీల్లో మొక్కల సంరక్షణపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు డీఆర్‌డీవో చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని తిమ్మంపేట, ఏబీతండా జీపీల్లోని నర్సరీలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైమరీ బెడ్స్‌లో విత్తనాలు మొలకెత్తేలా శ్రద్ధ వహించాలన్నారు. ప్రస్తుత వేసవి కాలం దృ